



ప్రజా పాలనలో దరఖాస్తులను స్వీకరిస్తున్న మంత్రి జూపల్లి



జిల్లాలో 4,77,808 దరఖాస్తుల స్వీకరణ

- జిల్లాలో ముగిసిన ప్రజా పాలన కార్యక్రమం
- ఎనిమిది రోజుల పాటు జరిగిన దరఖాస్తుల స్వీకరణ
- ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేస్తున్న సిబ్బంది
- జిల్లాలో అత్యధికంగా మహాలక్ష్మి పథకానికి దరఖాస్తులు



బోధన్‌లో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వం కొత్తగా చేపట్టిన ఆరు గ్యారెంటీల అమల్లో భాగంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమం శనివారంతో ముగిసింది. జిల్లాలో మొత్తం 4,77,808 దరఖాస్తులను స్వీకరించారు. నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాల్టీ పరిధిలో 1,39,528 దరఖాస్తులు, రూరల్ పరిధిలో 3,38,280 మొత్తం దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ప్రజాపాలనకు జిల్లాలో భారీ స్పందన వచ్చింది. జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల పరిధిలో నిర్వహించిన గ్రామ సభలు, ఏర్పాటు చేసిన కేంద్రాల్లో గ్రామస్థులు పెద్ద ఎత్తున దరఖాస్తులను అందజేశారు. జిల్లాలో ఎనిమిది రోజుల పాటు నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో వందలాది మంది దరఖాస్తు చేశారు. ఎక్కువ మంది మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేశారు. రోజువారీగా దరఖాస్తులు స్వీకరించిన అధికారులు మొత్తం ఆన్‌లైన్ చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా దరఖాస్తు చేసిన వారిలో అర్హులైన వారందరికీ ఈ పథకాలను వర్తింపజేయ నున్నారు.

డిసెంబరు 28 నుంచి జనవరి 6 వరకు

జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమాన్ని డిసెంబరు 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించారు. జిల్లాలోని 530 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలోని 146 వార్డుల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గ్రామం, మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో ప్రతిరోజూ ఈ దరఖాస్తులను తీసుకున్నారు. ప్రభుత్వం ఆదేశించిన విధంగా మహాలక్ష్మి పథకం, రైతుభరోసా పథకం, గృహజ్యోతి పథకం, ఇందిరమ్మ ఇళ్ల పథకం, చేయూత పథకం కింద ఈ దరఖాస్తులను స్వీకరించారు. ఈ పథకాల్లో మహాలక్ష్మి కింద ప్రతి మహిళకు 2500 రూపాయలు, 500లకు సిలిండర్, రైతుభరోసా కింద రైతుబంధు, కౌలురైతులకు 12వేల రూపాయలు, రైతులు పండించిన ధాన్యానికి 500 రూపాయలు, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, ఇందిరమ్మ పథకం కింద స్థలము, 5లక్షల రూపాయల వరకు నిర్మాణానికి ఇవ్వనుండటం, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నవారికి 250 గజాల జాగా, చేయూత పథకం కింద 4వేల రూపాయల పింఛన్ అందించేందుకు ఈ పథకాలను ప్రకటించారు. వీటిని ఈ ప్రజా పాలనలో భాగంగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం పింఛన్, రైతుబంధు వస్తున్న వారు ఆ పథకాలకు చేయాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆ పథకాలు రాని వారు దరఖాస్తు చేసుకోవచ్చని కోరారు. వీటితో పాటు మిగిలిన మూడు పథకాలకు కూడా దరఖాస్తులు చేయాలని కోరడంతో జిల్లాలోని అన్ని గ్రామాల పరిధిలో ఎక్కువ మంది ఈ దరఖాస్తులను చేశారు. జిల్లాలోని 530 గ్రామ పంచాయతీల పరిధిలో 4932 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో అధికారులను నియమించారు. ఆయా శాఖలకు చెందిన వారిని ఎనిమిది రోజుల పాటు ఆయా గ్రామాల్లో రెండు షిఫ్టుల ద్వారా ఈ దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 146 వార్డుల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 59 బృందాలను ఏర్పాటు చేసి గ్రామసభలు, వార్డు సభలను నిర్వహించి ఎనిమిది రోజుల్లో వీటిని పూర్తి చేశారు. ఎక్కువ మొత్తంలో సభలను నిర్వహించారు.

పాల్గొన్న ప్రజాప్రతినిధులు

జిల్లా వ్యాప్తంగా ఎనిమిది రోజుల పాటు నిర్వహించిన ఈ సభల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్ రెడ్డిలు, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుతో పాటు మున్సిపల్ చైర్మన్లు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఇతర నేతలు పాల్గొన్నారు. కలెక్టర్ నుంచి గ్రామీణ స్థాయి కార్యదర్శి వరకు పాల్గొన్నారు. నిత్యం దరఖాస్తులను స్వీకరించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అదనపు కలెక్టర్లు యాదిరెడ్డి, చిత్రమిశ్రా నిత్యం గ్రామాలు తిరుగుతూ దరఖాస్తులను పరిశీలించారు. గ్రామసభల్లో పాల్గొన్నారు.

భారీ స్పందన

జిల్లాలో ఎనిమిది రోజుల పాటు నిర్వహించిన ఈ ప్రజాపాలన సభలకు భారీ స్పందన వచ్చింది. జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో ప్రజలు పెద్ద ఎత్తున దరఖాస్తులను చేశారు. పలు పథకాలకు తమకు వర్తింపజేయాలని కోరారు. ప్రభుత్వం ఈ ప్రజాపాలనలో భాగంగా ప్రకటించిన ఐదు గ్యారెంటీలను అమలు చేసేందుకు ఈ దరఖాస్తులను స్వీకరించారు. ప్రస్తుతం పింఛన్లు వస్తున్న లబ్ధిదారులతో పాటు రైతుబంధు వస్తున్న వారు దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని ప్రకటించడంతో ఆ రెండింటికి మినహాయించి మిగతా మూడు గ్యారెంటీలకు దరఖాస్తు చేశారు.

జిల్లాలో ఈ ఎనిమిది రోజుల పాటు తీసుకున్న దరఖాస్తుల్లో అత్యధికంగా మహాలక్ష్మి పథకానికే ఎక్కువ మంది చేశారు. వచ్చిన దరఖాస్తుల్లో మెజార్టీ ఈ పథకం కోసమే చేశారు. ఈ పథకం కింద కొత్తగా మహిళలకు నెలనెలా 2500 రూపాయలు ఇవ్వడంతో గ్యాస్ సిలిండర్‌ను 500లకు అందిస్తామని తెలపడంతో ఎక్కువగా దరఖాస్తులు ఈ గ్యారెంటీకి చేశారు. దీని తర్వాత రైతుభరోసాకు ఎక్కువ మంది చేశారు. వచ్చిన దరఖాస్తులను అధికారులు అప్‌లోడ్ చేస్తుండగా ఇవే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. రైతుభరోసా కింద రైతుబంధు 15వేలకు పెంచడంతో పాటు కౌలు రైలుకు 12వేలు, ధాన్యానికి 500 బోనస్ ఇవ్వనుండటంతో చాలా మంది ఈ దరఖాస్తులను చేశారు. వీరి తర్వాత ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి పథకం, గృహజ్యోతికి ఎక్కువ మంది చేశారు. ప్రతి దరఖాస్తుల్లో ఈ ఐదు కాలంలు ఉండటం వల్ల ఎక్కువగా మాత్రం మహిళలు మహాలక్ష్మికి చేయడంతో రాష్ట్రస్థాయిలో కూడా ఈ పథకానికి ఎక్కువగా దరఖాస్తులు రాను న్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో రేషన్ కార్డుల కోసం ఈ ఐదు గ్యారెంటీలతో పాటు దరఖాస్తులు చేయాలని ప్రభుత్వం కోరకున్నా ఎక్కువ మంది వాటికి ప్రత్యేకంగా దరఖాస్తు చేశారు.

మూడు రోజులుగా ఆన్‌లైన్‌లో నమోదు

జిల్లాలో ఈ ఎనిమిది రోజుల్లో వచ్చిన దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లో చేస్తున్నారు. ఈ దరఖాస్తుల కోసం కొంత మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చి గడిచిన మూడు రోజులుగా వీటిని చేస్తున్నారు. జిల్లాలో ఎనిమిది రోజుల పాటు వచ్చిన దరఖాస్తులన్నీ ఆన్‌లైన్ చేస్తామని అధికారులు తెలిపారు. ఈ దరఖాస్తులపై ప్రభుత్వం నిర్ణయం తీసుకొని వీటిలో కొన్ని ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపే అమలు చేయనున్నట్లు తెలుస్తోంది.

ధనిక రాష్ట్రాన్ని దివాలా తీయించిన ఘనత కేసీఆర్‌దే

- బీఆర్ఎస్ హయాంలో పరిపాలన అస్తవ్యస్తం
- రూ.7లక్షల కోట్ల అప్పులకు 40వేల కోట్ల వడ్డీ చెల్లించాలి
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేస్తాం
- రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

కోటగిరి, జనవరి 6: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడే నాటికి 10వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో ఉన్న ధనిక రాష్ట్రాన్ని తొమ్మిదిన్నరేళ్ల కేసీఆర్ పాలనలో 7లక్షల కోట్ల అప్పులతో దివాలా తీసిన రాష్ట్రంగా మారిందని రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శనివారం ప్రజా పాలన ముగింపు కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలానికి తొలిసారిగా విచ్చేసిన మంత్రి జూపల్లికి కాంగ్రెస్ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ప్రజా పాలనలో దరఖాస్తులను మంత్రి స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 4కోట్ల ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ నెరవేర్చారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతోమంది ప్రాణత్యాగం చేశారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీకి నష్టం జరుగుతుందని తెలిసినా ప్రజల ఆకాంక్షలను నెరవేరిస్తే అప్పటి సీఎం కేసీఆర్ ప్రజల ఆశలు, ఆశయాలను నెరవేర్చలేదని దుయ్యబట్టారు. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్ర ఖజానాను లూటీ చేయడంతో పాటు తన కుటుంబ సభ్యులకే పదువులు, ఉద్యోగాలు కల్పించారని ఆరోపించారు. గత ఎన్నికల్లో మరోమారు అధికారం చేపట్టాలని భావించిన కేసీఆర్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంట రాష్ట్ర ఖజానాపై శ్వేత పత్రం విడుదల చేస్తే 7లక్షల కోట్ల అప్పు ఉందని, అప్పుకు సంవత్సరానికి 40వేల కోట్ల వడ్డీ చెల్లించాల్సిన దుస్థితి తలెత్తిందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రమాణ స్వీకారం రోజునే రెండు హామీలు అమలు చేసి మిగిలిన హామీల అమలుకు ప్రజా పాలన పేరుతో ప్రజా క్షేత్రంలోకి వచ్చామన్నారు. రాష్ట్రంలో మిషన్ భగీరథ పథకం అభాసు పాలైందని పేర్కొన్నారు. 40వేల కోట్లు ఖర్చు పెట్టి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించడంలో అప్పటి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామాల్లో మంచినీటి సరఫరా జరగకపోయిన నెల నెల కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు చెల్లించిందన్నారు. ఈ సమస్యపై రాష్ట్రంలో ప్రత్యేక దృష్టి సారించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలలో గ్యాస్ సిలిండర్ పథకం ఎంతో ప్రత్యేకమైందన్నారు. గ్రామాలలో నేటికి కొన్ని కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లు లేవన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు గ్యాస్ కంపెనీల ఏజెన్సీలతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకం అమలు చేశామని పేర్కొన్నారు. మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, డీసీవో సింహచలం, బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, సర్పంచ్ భారతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పిప్రిలో మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీ ధర్మపురి అర్వింద్

ఆర్మూర్‌రూరల్, జనవరి 6: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. శనివారం మండలంలోని పిప్రి గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన వికాసిత్ భారత్ సంకల్ప యాత్ర సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన మోదీకి గ్యారెంటి పథకానికి రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల ఉద్యోగులు గ్రామాలకు వస్తారని, అర్హులైన వారందరు కేంద్ర ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రేషన్‌కార్డు లేని వారు కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని, ప్రధాన మంత్రి అవాస్ యోజన పథకంలో అర్హులైన వారందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తారన్నారు. ఆయుష్మాన్ భారత్‌కు దరఖాస్తు చేసుకోవాని, దీని ద్వారా రూ.5లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా లభిస్తుందని, ఇదీ పేదప్రజలకు వరంలాంటిదన్నారు. అదే విధంగా అర్హులైన వారికి ఉజ్వల పథకంలో గ్యాస్ సిలిండర్‌లను కూడా కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రజల చెంతకు చేర్చేందుకు చొరవ చూపాలన్నారు. అదే విధంగా ఆర్మూర్ పట్టణంలో క్షత్రీయ సమాజ్ ఆధ్వర్యంలో క్షత్రీయ నూతన క్యాలెండర్‌లను ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వినోద్‌కుమార్, తహసీల్దార్ అల్వార్ శ్రీకాంత్, ఎంపీడీవో శ్రీనివాస్, ఉపసర్పంచ్ ఆసపురం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు దేగాం ఎర్రవ్వ, బీజేపీ మండల అధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, బీజేపీ నాయకులు పల్లె గంగారెడ్డి, కంచెట్టి గంగాధర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టవద్దని వినతి

వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామంలో 63వ జాతీయరహదారికి బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టవద్దని కోరుతూ గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు చేసిన తీర్మానాన్ని శనివారం వీడీసీ సభ్యులు, గ్రామస్థులు ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు అందజేశారు. పెర్కిట్‌లోని ఆయన నివాసంలో ఎంపీని కలిసి అంక్సాపూర్ గ్రామస్థులు ఇప్పటికే రైల్వేలైన్ నిర్మాణానికి పంట కాలువలకు విలువైన భూమిని ఇచ్చి నష్టపోయామని, బైపాస్ రోడ్డుకు భూములు ఇవ్వలేమని స్పష్టం చేశారు.

ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటాం

ఇందల్వాయి: ప్రతి బీజేపీ కార్యకర్తకు అండగా ఉంటామని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. శనివారం మండలంలోని చంద్రయాన్‌పల్లి గ్రామానికి చెందిన బూత్‌స్థాయి సభ్యుడు ఉబ్బిర్యాల అనిల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి గ్రూప్‌స్థాయి సభ్యుల సంక్షేమ నిధి నుంచి లక్ష రూపాయల చెక్కును మృతుడి భార్యకు అందజేశారు. పార్టీలో చాలా చురుగా పనిచేసేవాడని ఆయన మృతి పార్టీకి తీరనిలోటని తెలిపారు. మృతునికి భార్య నవనీతతో పాటు కుమార్తె మైతిలి, కుమారుడు అఖిరనందన్, తల్లిదండ్రులు గంగామణి, నర్సయ్య ఉన్నారు.

నేడు 'ఆంధ్రజ్యోతి' ముత్యాల ముగ్గుల పోటీ


నిజామాబాద్ అర్బన్/బోధన్ రూరల్, జనవరి 6: 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' వారి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలో రెండు ప్రాంతాల్లో నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో, బోధన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ముగ్గుల పోటీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9గంటల నుంచి ముగ్గుల పోటీలను నిర్వహించనున్నారు. కేవలం మహిళలు మాత్రమే పాల్గొనే అవకాశంతో పాటు చుక్కల ముగ్గులు మాత్రమే వేయాల్సి ఉంటుంది. మొదటి బహుమతిగా నగదు రూ.6వేలు, రెండో బహుమతిగా నగదు రూ.4వేలు, మూడో బహుమతిగా నగదు రూ.3వేలు అందజేయడంతో పాటు ముగ్గుల పోటీలో పాల్గొనే ప్రతి మహిళకు కన్సోలేషన్ ప్రైజ్‌లు ఇవ్వనున్నారు. కెనరా బ్యాంక్, స్వర్గసీమ సుఖేతన, ఎయిమ్స్ విద్యాసంస్థలు రాష్ట్రస్థాయిలో స్పాన్సర్‌లుగా వ్యవహరించనున్నారు. ఈ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన వారికి రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొనే అవకాశం కల్పించనున్నారు. హైదరాబాద్‌తో పాటు విజయవాడలో ఉమ్మడి రాష్ట్రాలకు చెందిన రాష్ట్రస్థాయి పోటీలు జనవరి 10న జరగనున్నాయి. హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో జిల్లాస్థాయిలో మొదటి స్థానంలో నిలిచినవారికి అవకాశం కల్పించనున్నారు.

ఉత్తమ ఫలితాల కోసం అధ్యాపకులు కృషి చేయాలి

నిజామాబాద్ అర్బన్, జనవరి 6: విద్యార్థుల భవిష్యత్తు అధ్యాపకుల చేతుల్లోనే ఉందని వారిని ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా తీర్చిదిద్దాలని డీఐఈవో రఘురాజ్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అకాడమిక్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు, వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. చదువుల్లో వెనకబడిన వారిని గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థుల అనుమానాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ నుస్రత్ జహాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.







వివేకానంద ఆశయ సాధనకు కృషిచేయాలి

డిచ్‌పల్లి, జనవరి6: వివేకానంద ఆశయ సాధనకు కృషి చేయాలని టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ కిరణ్‌రాథోడ్ అన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని ప్రతీ క్రీడాకారుడు ఓటమిని గెలుపుగా స్వీకరించి ముందుకు సాగాలని సూచించారు. శనివారం ఏబీవీపీ స్వామి వివేకానంద, సుభాశ్ చంద్రబోస్ జయంతి పురష్కరించుకొని నిర్వహిస్తున్న క్రీడాపోటీలకు రాథోడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడకారులను ఆయన పరిచయం చేసుకొని మాట్లాడుతూ స్వామి వివేకానంద, సుభాశ్ చంద్రబోస్‌లను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుకుండలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజు, నాయకులు సాయికుమార్, అమృత్‌చారి, ప్రమోద్, సింహాద్రి, నర్సింహ, పాల్గొన్నారు.

'ఓబీసీ మహిళలకు రిజర్వేషన్ కోటా కల్పించాలి'

డిచ్‌పల్లి, జనవరి6: ఓబీసీ మహిళలకు రిజర్వేషన్ కోటాను పెంచాలని ఛత్రపతి పూలే జాగృతి వ్యవస్థాక సభ్యుడు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 2023 సంవత్సరంలో మహిళా చట్ట సభల్లో ఓబీసీ మహిళలకు రిజర్వేషన్ కోటా పెంపు చేయకపోవడంతో చాలామంది ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. మోజార్టీ మహిళలు చట్టసభల్లో అడుగు పెట్టే అవకాశం కోల్పోతున్నారని మహిళా సాధికరతకు బీజేపీ ప్రభుత్వాన్ని చట్ట సభల్లో మహిళా బిల్లు పెంపుచేయాలని డిమాండ్‌చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఈ బిల్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రసాద్, దినేశ్, సుమలత, సంతోషిని, లావణ్య, గీత,జ్యోతి. పాల్గొన్నారు.

అండర్-20 బాలబాలికల జట్టుకు శిక్షణ శిబిరం

మెండోర, జనవరి6: మండలంలో బుస్సాపూర్ గ్రామంలో అండర్-20 బాలబాలికల కబడ్డీ జట్టుకు శిక్షణ శిబిరాన్ని డీసీసీబీ డైరెక్టర్ నాగంపేట్ శేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 9వ తేదీ వరకు శిక్షణ శిబిరం కొనసాగుతుందని, సిద్దిపేట్ జిల్లా గజ్వేల్‌లో ఈనెల 11నుంచి 13వ తేదీ వరకు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలల్లో జిల్లా జట్టు పాల్గొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపిడి సుజాత, గంగారెడ్డి, ఎంపీటీసీ నడ్పన్న, జాతీయస్థాయి కబడ్డీ క్రీడాకారులు గంగాధర్, ఏలేటి శ్రీనివాస్, మార ముత్యంరెడ్డి, శ్రీనివాస్, ప్రతాప్ పాల్గొన్నారు.

జిల్లా కారాగారాన్ని సందర్శించిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బృందం

నిజామాబాద్ లీగల్, జనవరి6: జిల్లాలోని కారాగారాన్ని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బృందం శనివారం సందరించింది. జైలులో ఉన్న ఖైదీలనుద్దేశించి చీఫ్ లీగల్ ఎయిడ్ రాజ్‌కుమార్ సుబేదార్ మాట్లాడుతూ కారాగారంలో ఉన్న ఖైదీలు ముందుకొని లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ యొక్క సేవలను వినియోగించుకోవడానికి దరఖాస్తులను ఇవ్వాలని కోరారు. అలాగే ఖైదీలకు ఎటువంటి సమస్య వచ్చినా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఖైదీలకు ఇచ్చిన విజ్ఞప్తి పత్రాలను జిల్లా న్యాయసేవాధికార సంస్థ న్యాయాధికారి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ ఉదయ్‌కృష్ణ, అసిస్టెంట్ కౌన్సిల్ శుభం, ప్రమోద్ పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు తడపాకల్ విద్యార్థుల ఎంపిక

ఏర్గట్ల, జనవరి6: మండలంలోని తడపాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న సమ్రిన్, సౌమ్యకు చింతోజు బ్రహ్మయ్య బాల ప్రతిభా పురస్కారానికి ఎంపికైనట్లు పాఠశాల తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ తెలిపారు. 2022- 2023 సంవత్సరానికి గాను సమ్రిన్ రాసిన ముద్ద బంతి పుస్తకానికి, సౌమ్య రాసిన బంగారు బాల్యం పుస్తకాలకు ఈ పురస్కారాలు లభించాయని, వీరికి నగదు పురస్కారంతో పాటు, ప్రశంస పత్రాలు అందుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమన్యం విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ధర్మారం గురుకుల విద్యార్థిని ఎంపిక

డిచ్‌పల్లి, జనవరి 6: డిసెంబరు 21 నుంచి 23 వరకు నిర్మల్ జిల్లా ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి 67వ స్కూల్ గేమ్స్ అండర్-17 పోటీల్లో ధర్మారం గురుకుల పాఠశాల విద్యార్థిని దీప, జిల్లా జట్టు తరుపున పాల్గొని బంగారు పతకం సాధించిందని ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు. బంగారు పతకం సాధించిన దీప, ఈ నెల 10నుంచి 15వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని వీక్కనిర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు దీప ఎంపికైందని హెచ్ఎం సంగీత, ఫిజికల్ డైరెక్టర్ నీరాజ, పీఈటీ జ్యోత్స్న లుతెలిపారు. జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబర్చాలని వారు ఆకాంక్షించారు.

కాంగ్రెస్‌లో చేరిన మెంట్రాజ్‌పల్లి ఎంపీటీసీ

డిచ్‌పల్లి, జనవరి 6: మండలంలోని మెంట్రాజ్‌పల్లి గ్రామ బీజేపీ ఎంపీటీసీ సుధీర్ శనివారం ఆ పార్టీ కి రాజీనామా చేసి రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్.భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. రాబోవు రోజుల్లో అన్ని పార్టీల కు సంబంధించిన ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారని బీఆర్ఎస్ నిర్బంద కంబంద హస్తల నుంచి బయటపడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముల్లంగి ఎంపీటీసీ నర్సయ్య కాంగ్రెస్ ప్రతినిధులు షాదుల్ల, కంచెట్టి గంగాధర్, పాల్గొన్నారు.

బాలికలకు రంగోత్సవ్ బహుమతుల పంపిణీ

మోర్తాడ్, జనవరి6: మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో శనివారం రంగోత్సవ్ బహుమతులను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ బాలికలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలరాజు, ఉపాధ్యాయులు సంధ్యరాణి, శ్రావణి, మౌనిక, రాము, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

మెండోర, జనవరి6: మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 2024సంవత్సర పీఆర్‌టీయూ నూతన క్యాలెండర్‌ను ఎంపీపీ బురుకల సుకన్య కమలాకర్, ఎంపీడీవో శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం నూతన క్యాలెండర్‌ను పీఆర్‌టీయూ నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కొత్తపల్లి శ్రీనివాస్, నవీన్, మనోహర్, శ్రీనివాస్, నర్సింలు, నర్సయ్య, దేవన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలి

వర్ని, జనవరి6: ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఐసీటీసీ కౌన్సిలర్ రమేష్ పిలుపునిచ్చారు. శనివారం వర్నిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై కళా బృందంచే అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌కే మేనేజర్ ప్రవంతి, వార్డ్ ఎన్‌జీవో కోఆర్డినేటర్ ధర్మేందర్, వైస్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

హంతకుల కోసం గాలింపు

నిజామాబాద్ రూరల్, జనవరి6: రూరల్ మండలం మల్కాపూర్ తండా సమీపంలో గండి అటవీ ప్రాంతంలో శుక్రవారం రాత్రి హత్యకు గురైన వ్యక్తి వివరాలు గుర్తించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మృతుడు నగరంలోని ఇంద్రాపూర్‌కు చెందిన గరుదాకర్ సయాజీ (30) గుర్తించారు. గరుధాకర్ లేబర్ పనులు చేసుకుని జీవిస్తున్నాడని, స్నేహితులతో కలిసి మద్యం తాగేందుకు మల్లారం గండి ప్రాంతానికి వెళ్లినట్లు తెలిపారు. బీరు బాటిళ్లు, మద్యం బాటిళ్లు, వాటర్ బాటిళ్లు తీసుకుని మల్లారం గండిలో దావత్ చేసుకున్నారు. తర్వాత జరిగిన ఘర్షణలో గరుదాకర్ సయాజీ గొంతుకోసి హత్యచేసినట్లు నిర్ధారణకు వచ్చారు. గరుదాకర్ సయాజీని హత్యచేసిన వారికోసం పోలీసులు గాలిస్తున్నారు. ఘటనాస్థలిలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. బాటిళ్లపై వేలిముద్రలు, తదితర సాక్ష్యాలు సేకరించారు. హంతకుల కోసం ప్రత్యేక టీంను ఏర్పాటుచేసినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపారు.

కాంగ్రెస్ కార్యకర్తలను పరామర్శించిన సునీల్‌కుమార్

మోర్తాడ్, జనవరి6: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బబ్లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నాయకుడు ముత్యాల సునీల్‌కుమార్ ఆయనను పరామర్శించి ఆరోగ్య సమాచారాన్ని అడిగితెలుసుకున్నారు. ఆయనవెంట మండల అధ్యక్షుడు ముత్యాల రాములు, జిల్లా కార్యదర్శి గిర్మాజీ గోపి, తదితరులున్నారు.

ఆరోపణలు అవాస్తవం

- ఖిల్లా రామాలయ కమిటీ చైర్మన్ మహేందర్ వెల్లడి

డిచ్‌పల్లి, జనవరి6: కొందరు తనపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని ఖిల్లా రామాలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాను ఎలాంటి అవినీతి చేయలేదన్నారు. తాను అవినీతి చేసి ఉంటే దేనికైనా సిద్ధమని, విచారణకు సిద్ధమని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి వేముల దీప్తి

ప్రణాళికతో చదివి ఉన్నతస్థానంలో నిలవాలి

ఆర్మూర్‌రూరల్, జనవరి6: విద్యార్థులు ప్రణాళికతో చదివి ఉన్నతస్థానంలో స్థిరపడాలని ఆర్మూర్ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి అన్నారు. శనివారం ఆర్మూర్ మండలంలోని చేపూర్‌లో ఏర్గట్ల రాజుబాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్‌జడ్జి దీప్తి వేముల మాట్లాడుతూ విద్యార్థిదశ ప్రతీఒక్కరికి జీవితంలో గుర్తుండిపోయేదన్నారు. విద్యార్థులు ఇష్టంతో చదవాలని, లక్ష్యాలను ఏర్పర్చుకొని వాటి సాధనకు కృషిచేస్తే విజయం సొంతమవుతుందని అన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలు డ్రైవింగ్ చేయవద్దని, డ్రాగ్స్, మాదక ద్రవ్యలకు అలవాటుపడవద్దని, చదువుపైనే దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇందూర్ సాయన్న, ట్రస్ట్ ఛైర్మన్ ఏర్గట్ల పోశన్న, వినోద్‌కుమార్; సవ్యశ్రీ, పాఠశాల హెచ్‌ఎం చేతనకుమారి, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, మీనుగు రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు ప్రతీఒక్కరికి అందించాలి

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

ఎడపల్లి, జనవరి6: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతీఒక్కరికి అందేలా చూడాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల డాటా ఎంట్రీని ఆయన పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డాటా ఎంట్రీలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే వాటిని నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రజలు ఇచ్చిన దరఖాస్తులో ఏమైనా తప్పులు ఉంటే వాటిని అధికారులు సరిచేసి డాటా ఎంట్రీ చేయాలని సూచించారు. ఎమ్మెల్యేగా గెలిచి మొదటిసారిగా మండల పరిషత్ కార్యాలయానికి రావడంతో అధికారులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత తొమ్మిదిన్నర సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన గతపాలకు రాష్ట్ర ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం వహించడంతో ప్రజలు అవస్థలు పడాల్సి వచ్చిందని, ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు అర్హులైన ప్రతీఒక్కరికి ఆరు గ్యారంటీలను అందాస్తామన్నారు. జనవరి చివరి వారం నుండి విద్యాశాఖపై దృష్టి సారించి ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో మెరుగైన విద్యను అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీల ద్వారా రైతులు ఎరువులు కొనుగోలు చేయాలని, రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. గత ప్రభుత్వంలో సహకార సంఘాల్లో పాలకవర్గానికి కావలసిన వారికే ఎరువులు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని, ప్రస్తుతం అలా జరిగిందని తమ దృష్టికి వస్తే సహకార సంఘం కార్యదర్శితోపాటు అధ్యక్షులపై సైతం చర్యలుంటాయని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బోదన్ పురపాలక సంఘం ఛైర్మన్ తూము పద్మ శరత్ రెడ్డి, బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, ఎంపీడీవో గోపాలకృష్ణ, ఎంపీపీ శ్రీనివాస్, నాయకులు మోహన్ రెడ్డి, పులి శ్రీనివాస్, బిల్లా రామ్మోహన్, నారాయణ, ఫర్హాన్, లింగం, కామప్ప, రాంగోపాల్‌రెడ్డి, విజయ్ కుమార్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

అధికారులు పనితీరు మార్చుకోవాలి

నవీపేట: ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకు అధికారులు తమ పనితీరును మార్చుకోవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించిన అనంతరం మండల అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వంలో ఉన్నట్లు బాధ్యతారహితంగా పనిచేస్తే సహించేది లేదని పలువురు అధికారులకు హెచ్చరించారు. యంచ డీఫ్లోరైడ్ స్కీమ్‌లో నీటి శుద్ధికరణ వివరాల రిపోర్టులను ఇకపై ప్రతీవారం తనకు అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. యాసంగి పంటల సాగుకు సంబంధించి గ్రామాల వారిగా పంటల వివరాలు, సాగువిస్తీర్ణం, ఎరువుల వినియోగం వంటి వివరాలను అందించాలని వ్యవసాయ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల వివరాలు, విద్యార్థులసంఖ్య, ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాలల ప్రగతివంటి వివరాలను అందించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. నవీపేట సొసైటీలో గతంలో అరువుగా ఇచ్చిన లక్షలాది ఎరువుల బకాయిలను ఎందుకు వసూలు చేయలేదని సొసైటీ కార్యదర్శిని ప్రశ్నించారు. ఎరువుల బకాయిలను వసూలు చేయాలని, దీనికి సంబంధించిన రిపోర్ట్‌ను అందజేయాలని అధికారులను ఆదేశించారు. తుంగినిలో చేపట్టిన మరమ్మతుల పనులు నాణ్యత లోపంగా ఉండడంతో ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

చెరువును కబ్జాచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

మాచారెడ్డి, జనవరి 6: పాల్వంచ మండలం పరిధిపేట గ్రామంలో చెరువును కబ్జాచేస్తున్న కొందరు నాయకులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. శనివారం గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు తహసీల్దార్, ఇరిగేషన్ ఏఈ, పోలీసులు చెరువు వద్దకు చేరుకుని రెండు టిప్పర్‌లు, జేసీబీని స్వాధీనం పరుచుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామపంచాయతీ తీర్మానం లేకుండా అక్రమంగా పైఅధికారులను బెదిరిస్తూ చెరువు మధ్యలో కోళ్ల ఫారానికి రోడ్డువేసి చెరువులో నీరు నిల్వకుండా చెరువు అలుగును ధ్వంసం చేశారని తెలిపారు. దీంతో దాదాపు 500ఎకరాల వ్యవసాయ భూమికి నీరు అందకుండా పోయిందని అదే చెరువు నుంచి ప్రతీరోజు 100ట్రిప్పుల వరకు మొరం అక్రమ మైనింగ్ జరుపుతున్నారని ఆరోపించారు. కోళ్ల ఫారం నుంచి వచ్చే దుర్వాసన ఈగల ద్వారా గ్రామప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని చెప్పారు. దీనిపై ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. గతంలో ఈ కోళ్లఫారాలను తొలగించాలని గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం చేశామని అలాగే చెరువు మత్తడిని ధ్వంసం చేసినా, చెరువును అక్రమంగా కబ్జా చేసి రోడ్డు వేసుకున్న కోళ్లఫారం యాజమానులపై తగిన చర్యలు తీసుకోవాలని తీర్మానం చేస్తుపై అధికారులకు సైతం పంపామని తెలిపారు. కాగా ఈ విషయంపై ఎస్‌ఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా అక్రమంగా చెరువునుంచి మొరంను తరలిస్తున్న జయంత్‌రెడ్డి, బట్టశంకర్‌లపై నీటిపారుదల శాఖ ఏఈ మాలిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.



జేసీబీతో తవ్వకాలు జరుపుతున్న దృశ్యం



విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న హంపీ పీఠాధిపతి

మోర్తాడ్‌లో అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

● హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి మహాస్వామి

మోర్తాడ్, జనవరి 6: మండలంలో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి దివ్యక్షేత్రంలో శనివారం జగద్గురు శంకరచార్య హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి మహాస్వామి ప్రతిష్ఠాపన చేశారు. మండలకేంద్రంలోని జాతీయరహదారి పక్కన నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం నుంచి ప్రతిష్ఠాపన ఉత్సవాలు జరుగుతున్నాయి. శనివారం వేకువ జామున యంత్ర ప్రతిష్ఠా, విగ్రహ ప్రాణప్రతిష్ఠ, గణపతి పూజ, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన శాంతి పౌష్టిక హోమములు, బలిహరణ, 18మెట్ల తొలిపూజ నిర్వహించారు. గురువారం నుంచి శనివారం వరకు నిత్యాన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండల అయ్యప్ప సేవ సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాలలో పరిసర గ్రామాలకు చెందిన అయ్యప్పస్వాములు భారీ ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో వేదపండితులు చంద్రశేఖర్ శర్మ గురుస్వామి, గంగప్రసాద్ దీక్షిత్, శివకుమార్‌శర్మ, రాజగౌతమ్‌శర్మ, మణిదీప్‌శర్మ, పురోహితుడు ప్రవీచణ్‌చారి పాల్గొన్నారు.

మొరం టిప్పర్లకు జరిమానా

నవీపేట, జనవరి 6: మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్ శివారులో అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకొని సంబంధిత టిప్పర్ల యజమానులకు రూ.20 వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ ధన్‌వాల్ శనివారం తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న ఒక్కోక్క టిప్పర్‌కు 10వేల రూపాయల చొప్పున రెండు టిప్పర్లకు 20వేల రూపాయల జరిమానా విధించినట్లు చెప్పారు. అక్రమంగా మొరాన్ని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గేమింగ్ చట్టాలపై అవగాహన సదస్సు

నిజామాబాద్‌లీగల్, జనవరి6: డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య శనివారం జిల్లా కోర్టులో డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులకు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బూసారపు రాజేష్‌గౌడ్ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈక్రమంలో గేమింగ్ చట్టాల గురించి, నియమనిబంధనల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రాసిక్యూటర్లు ఎండీ రహీముద్దీన్, బంటు వసంత్, రాజారెడ్డి, డివిజన్ సీఐలు, ఎస్సైలు, ఎక్సైజ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు

దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్ టౌన్, జనవరి 6: తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ జి.దణవేణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 11వ తేదీ లోపు తమ దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులలో బోధించుటకు అతిథి అధ్యాపకులు 55శాతం పీజీ ఉత్తీర్ణత సాధించి నెట్, సెట్, పీహెచ్‌డీ బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని ఆమె తెలిపారు. రాత పరీక్ష, మెమోలు ఈనెల 19న నిర్వహిస్తామని, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా హిందీ దివాస్

ముప్కాల్, జనవరి6: హిందీ భాష దినోత్సవాన్ని ముప్కాల్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుకు వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. పిల్లలచే తయారు చేయబడిన హిందీ భాషకు సంబంధించిన కథలు, పద్యాలు సంబంధించిన పుస్తకాన్ని ఎంఈవో బట్టు రాజేశ్వర్ ఆవిష్కరించారు. పాఠశాలలో హిందీ బోధిస్తున్న ఉపాధ్యాయులు అజ్మత్, కవిత పాఠశాల హెచ్‌ఎం శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గంగారాం మాట్లాడుతూ దేశంలో ఎన్నో సాంస్కృతులు, ఆచారాలు, బాషలు ఉన్నప్పటికీ దేశవ్యాప్తంగా ఒకే భాష ఉండడంతో ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుండోజి నరేందర్, శ్రీనివాస్; రవి, సురేష్, చిన్నయ్య, రవికుమార్, రాజేంధర్, నవీన, సీత, కవిత, సునీత, భగవన్‌దాస్, ప్రసాద్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

కోళ్లు, గొర్రెల పెంపకం ద్వారా అదనపు ఆదాయం

● నాబార్డు డీడీఎం ప్రవీణ్

డిచ్‌పల్లి, జనవరి 6: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్వయం ఉపాధి గ్రామీణ శిక్షణ సంస్థ డిచ్‌పల్లి శిక్షణ కేంద్రంలో నాబార్డు డీడీఎం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు కోళ్ల పెంపకం, పశువుల పెంపకం, గొర్రెల పెంపకం ద్వార అదనపు ఆదాయం పొందవచ్చు అని పేర్కొన్నారు. చేతి వృత్తుల ద్వార నాబార్డు ఆదాయం సమాకుర్చేందుకు సహకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్, ఎస్‌బీఐ సిబ్బంది భాగ్యలక్ష్మీ , రంజిత్, నవీన్, నర్మద, పారిదా, బ్యూటీ పార్లర్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సాయి పారాయణం

ముప్కాల్, జనవరి6: ముప్కాల్ మండలంలోని పడిలేచిన మర్రిచెట్టు దేవస్థానం వద్ద శివసాయి మందిరంలో సప్తహ పారాయణం కొనసాగుతోంది. అవదుతనంద సరస్వతిస్వామి దివ్యశీస్సులతో ప్రారంభమైన పారాయణం 108జంటలతో కొనసాగుతుంది. ఉదయం, సాయంత్రం సాయిభజనలు, కీర్తనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

ప్రమాదకరంగా మూలమలుపులు!

● కనిపించని సూచిక బోర్డులు ● పట్టించుకోని అధికారులు

కమ్మర్‌పల్లి, జనవరి6: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారి ప్రమాదాలకు నెలవుగా మారింది. నిజామాబాద్, జగిత్యాల జిల్లాల సరిహద్దు మండలమైన కమ్మర్‌పల్లికి అటు మోర్తాడ్ మండలం ఇటు జగిత్యాల జిల్లా సరిహద్దు గండిహనుమాన్ వరకు కేవలం 6కిలోమీట్ల దూరం మాత్రమే జాతీయ రహదారి ఉంటుంది. స్థానిక పోలీస్టేషన్ వద్ద ఈ జాతీయ రహదారికి 90డిగ్రీల మలుపు ఉంటుంది. ఈ మలుపువద్దే తరుచూ ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాలిలో కలుస్తున్నా పటించుకొనేవారు కరువయ్యారు. ఈ మలుపు రోడ్డు కిరువైపులా చెట్లు ఏపుగా పెరిగి ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలకు దారితీస్తోంది. కాగా జాతీయ రహదారికి ఇరువైపులా ఇతర గ్రామాలకు వెళ్లే రహదారులు ఉన్నా వాటివద్ద కనీస సూచిక బోర్డులు లేక ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులతోపాటు ప్రమాదాలకు లోనవుతున్నారు. మండల కేంద్రం నుంచి భీమ్‌గల్ వైపు వెళ్లే రహదారిపై సైతం ప్రమాదకర మలుపులు ఉన్నా సూచికబోర్డులు లేక తరుచూ ప్రమాదాలు జరుగుతాయి. జాతీయ రహదారికి రువైపుల ఎత్తుగా పెరిగిన చెట్లను పూర్తి స్థాయిలో తొలగిస్తే తప్ప ప్రమాదాలు అదుపు చేయడం కష్టమని అని స్థానికులు వాహనదారులు అంటున్నారు. ఈ రహదారిపై పలుమార్లు ప్రమాదాలు సంభవించి కొందరు మరణించగా మరి కొందరు తీవ్ర గాయాలతో బయట పడారు. కాగా తరుచు ఇక చిన్నచితక ప్రమాదాలలో గాయాలతో భైడపడిన వారి సంఖ్య వందల్లో ఉంటుదని స్థానికులు చెబుతున్నారు. జాతీయ రహదారికి పక్కనుండే ఉన్నా తిమ్మాపూర్, నాగాపూర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల వద్ద సూచిక బోర్డు లేక పోవడంతో ఆయా గ్రామల నుంచి జాతీయ రహదారి పైకి వచ్చే వాహనాలు స్పీడ్‌గా మేయిన్‌రోడ్డు పైకి రావడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కాలనీవాసులు రోడ్డు దాటుతూ ప్ర మాదాలుకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు సంభవిస్తున్న ప్రమాద మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రహదారులకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లపై భాగాలను తొలగించి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.



కమ్మర్‌పల్లి పోలీస్టేషన్‌వద్ద ప్రమాద మలుపు



మలుపు వద్ద కనిపించని సూచిక బోర్డు



చెక్కును అందజేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

జోస్ అలుక్కాస్ సామాజిక సేవలు అభినందనీయం

- ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ అర్బన్, జనవరి 6: బంగారు వజ్ర ఆభరణాల వ్యాపారంలో ముందంజలో ఉన్న జోస్ అలుక్కాస్ జ్యూవెలరీ షోరూం సామాజిక బాధ్యతల సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యానారాయణ గుప్త అన్నారు. శనివారం జోస్ అలుక్కాస్ జ్యూవెలరీ షోరూం ప్రథమ వార్షికోత్సవ వేడుకలను హైదరాబాద్ రోడ్‌లోని షోరూంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యానారాయణ, నగర మేయర్ నీతూకిరణ్‌లు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, కేక్ కట్‌చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జోస్ అలుక్కాస్ ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులు సుమారు 2లక్షల 41వేల 338తో కొనుగోలు చేసిన పాఠశాలకు సంబంధించిన సామగ్రి చెక్కును జడ్పీహెచ్ఎస్ బొమ్మదేవున్‌పల్లి ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సుధామధు, కార్పొరేటర్ మాస్టర్ శంకర్, బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ అలెక్స్, అకౌంట్స్ మేనేజర్ సజేష్, పీఆర్‌వో నరేందర్, మురళీగుప్త, విజయ్‌కుమార్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీ ఫెడరేషన్ సమావేశానికి ఈగ సంజీవ్‌రెడ్డి

సుభాష్‌నగర్, జనవరి 6 : జాతీయ ఆర్చరీ ఫెడరేషన్ సమావేశానికి తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు ఈగ సంజీవ్‌రెడ్డి హాజరయ్యారు. ఢిల్లీలో శనివారం జరిగిన ఆర్చరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సమావేశానికి హాజరై త్వరలో జరగనున్న హాకీ ఫెడరేషన్ ఎన్నికలపై చర్చించారు. ఫెడరేషన్ ఎన్నికలు ఏకగ్రీవంగా అయ్యేందుకు చర్చలు జరిగినట్లు ఈగ సంజీవ్‌రెడ్డి తెలిపారు. అనంతరం అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులను అభినందించారు.

వ్యవసాయ మంత్రి తుమ్మలను కలిసిన మార్క్‌ఫెడ్ చైర్మన్

ఖిల్లా, జనవరి 6: రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మార్క్‌ఫెడ్ పరిస్థితిని ఆయనకు వివరించారు. ఆయనతో పాటు మార్క్‌ఫెడ్ ఎండీ సత్యనారాయణ రెడ్డి, జీఎం విష్ణువర్ధన్‌రావులు కలిసిన వారిలో ఉన్నారు.

రోడ్డుపై కూరగాయలు అమ్మకుండా చర్యలు

ఖిల్లా, జనవరి 6: జిల్లా కేంద్రంలోని గోదాంరోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా కూరగాయాలు అమ్ముతున్న విక్రయదారులపై నగర ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. శనివారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వచ్చిన "ఎమ్మెల్యే ఇంటికి దారేది" కథనానికి ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. శనివారం ఉదయమే గోదాం రోడ్డు వద్దకు వచ్చిన ట్రాఫిక్ సీఐ, ఎస్ఐ తన సిబ్బందితో రోడ్డును క్లియర్ చేశారు. వాహనాలు వెళ్లకుండా అడ్డుగా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించారు.

క్రీడా పోటీలకు సిరికొండ విద్యార్థులు

సిరికొండ జనవరి 6: రాష్ట్ర స్థాయి రగ్బీ క్రీడల పోటీలకు సిరికొండ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ అబ్బయ్య తెలిపారు. జిల్లా జట్టు కోసం మోపాల్ హైస్కూల్లో జరిగిన ఎంపికలో సిరికొండ హైస్కూల్‌కు చెందిన ఆరుగురు బాలికల జట్టుకు ఎంపిక కాగా స్టాండ్‌బై గా ముగ్గురు విద్యార్థులు ఎంపికయినట్లు అబ్బయ్య తెలిపారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదు

మోపాల్, జనవరి 6: ప్రజా పాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను ఎంపీడీవో కార్యలయంలోని కంప్యూటర్‌లో అధికారులు దగ్గరుండి నమోదు చేస్తున్నారు. డిసెంబరు 28నుంచి ప్రారంభమైన ప్రజాపాలన కార్యక్రమం జనవరి 6వరకు ముగిసింది. వచ్చిన దరఖాస్తులను గ్రామాల వారీగా నమోదు చేస్తున్నారు. మండలంలోని న్యాలకల్, సిర్పూర్, ముదక్‌పల్లి, గుడితండా, శ్రీరాంతండా, కాల్పోల్, బైరాపూర్, మంచిప్ప, అమ్రదాబాద్, ఎల్లమ్మకుంట, బాడ్సి, సింగంపల్లి, కులాస్‌పూర్, కులాస్‌పూర్ తండా, కంజర్, తానాకుర్దు, తదితర గ్రామాల్లో అధికారులు గ్రామపంచాయతీ ఆవరణలో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. వచ్చిన దరఖాస్తులనింటిని ప్రతి ఒక్కటి కంప్యూటర్‌లో నమోదు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో సిబ్బంది దరఖాస్తులను నమోదు చేయడంలో నిమగ్నమయ్యారు.

సాంస్కృతిక పోటీలో విద్యార్థుల ప్రతిభ

ఇందల్వాయి, జనవరి 6: మెదక్ జిల్లా నర్సాపూర్‌లో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక పోటీలో గిరిజన బాలికల సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు. విద్యార్థులు సాంస్కృతిక పోటీలైన సంగీతం, వ్యాసరచన, నృత్యం పోటీల్లో ఉత్తమ బహుమతులు పొందారని అన్నారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు. రానున్న రోజుల్లో మరింత ప్రతిభ కనబర్చి ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు.

విద్యార్థులకు జామెంట్రీ బాక్సుల వితరణ

ఇందల్వాయి, జనవరి 6: మండలంలోని ఎల్లారెడ్డిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శ్రీరామ స్వచ్ఛంద సేవా సంస్థ శనివారం జామెంట్రీ బాక్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవాసంస్థ అధ్యక్షుడు తంగెళపల్లి శ్రీనివాస్, కోశాధికారి రామ్మోహన్, సభ్యులు శ్రీనివాస్, దయాకర్, శేఖర్, ప్రమోద్, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయోధ్య రాముని అక్షింతల పంపిణీ



ఎరాజ్‌పల్లిలో అయోధ్య రాముడి అక్షింతలతో శోభాయాత్ర



డొంకేశ్వర్‌లో..



ఆర్మూర్‌లో..

బోధన్ రూరల్, జనవరి 6: జిల్లా వ్యాప్తంగా శనివారం అయోధ్య రాముని అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని భక్తిశద్ధలతో చేపట్టారు. బోధన్ మండలంలోని ఎరాజ్‌పల్లి గ్రామంలో శనివారం ఇంటింటికి అయోధ్య అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు బోధన్‌లోని శ్రీరామ ఆలయంలో, గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్య రామ మందిరంలో పూజలు చేసి అక్షింతలు తెచ్చిన వాటిని ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిట్ల కృష్ణ మహరాజ్, సర్పంచ్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ వెంకటేష్, డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, మాజీ సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్, దాస్‌గౌడ్, సాయిరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి: మండలంలోని చంద్రయాన్‌పల్లిలో శనివారం అయోధ్య రామమందిరానికి చెందిన అక్షింతలను గ్రామ పెద్దలు, యువకులు భక్తిశ్రద్ధలతో పంపిణీ చేశారు. ముందుగా స్థానిక హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలోని ప్రతి ఇంటికి అందజేశారు. అక్షింతలను తీసుకో వడానికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి అక్షింతలను స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామంలోని యువకులు, మహిళలు పాల్గొన్నారు.

రెంజల్: మండలంలోని దండిగుట్ట గ్రామంలో శనివారం అయోధ్య రామమందిరం పూజిత అక్షింతలను రాముడి చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జగదీష్, గ్రామస్థులు నరసింహ రెడ్డి, కృష్ణయ్య తదితరులున్నారు.

కోటగిరి: మండల కేంద్రానికి శనివారం అయోధ్య రాముడి పవిత్ర అక్షింతలు చేరుకున్నాయి. చావిడి హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని పలువురు కుల సంఘాల ప్రతినిధులను ఆహ్వానించి అక్షింతలు, కలశం అందజేశారు. ఆదివారం నుంచి గ్రామంలో ఇంటింటికీ అక్షింతలు వితరణ చేసి ఈ నెల 22వ తేదీన సాయంత్రం దీపాలు వెలిగించి అక్షింతలను శ్రీరాముడి విగ్రహానికి, ఇష్ట దేవుడికి సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పత్తి లక్ష్మణ్, మాజీ ఎంపీపీ గంగాధర్ రావు దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: మండల కేంద్రంలో శనివారం రాముల వారి అయోధ్య పూజిత అక్షింతలు ప్రతీ గడపగడపకూ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దుమ్మజీ శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో గొల్లపేట ఇందిరమ్మకాలనీతోపాటు గ్రామంలో శనివారం ప్రతీ ఇంటికి రాముల వారి అయోధ్య పూజిత అక్షింతలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన రామ భక్తులు కమలాకర్, చంద్రయ్య, రాజేష్, నవీన్, రాములు, నర్సయ్య, పురోహితులు అనిల్‌చారి తదితరులు పాల్గొన్నారు. కాగా, రాములోరి పూజిత అక్షింతల కలశానికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

డొంకేశ్వర్: మండల కేంద్రంతో పాటు దత్తాపూర్ గ్రామంలో అయోధ్య రాముని భక్తులు భజన సంకీర్తనలతో వాహనం ద్వారా ప్రధాన వీధులగుండా శ్రీరామ నామ స్మరణాలతో శోభాయాత్ర నిర్వహించారు. మేళతాళలు, కుంకుమ భరణితో మహిళలు ఇంటింటికి వెళ్లి అయోధ్య రామ మందిర నుంచి తీసుకువచ్చిన అక్షింతలను పంపిణీ చేశారు. గ్రామంలో రామాలయంలో అక్షింతలకు పూజలు చేసి అక్షింతలతో పాటు రామ మందిరంతో ముద్రించిన చిత్రాన్ని అందించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సురేందర్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు రామాగౌడ్, దర్మన్న గారి సాయిరెడ్డి, స్వామి, గజ్జిరామ్, శేఖర్, నరేందర్ యాదవ్, విష్ణు, ప్రణయ్‌గౌడ్, ప్రకాష్‌గౌడ్, సత్యకుమార్ పాల్గొన్నారు.

ముప్కాల్: అయోధ్య రామయ్య పూజిత అక్షింతలను శనివారం బాల్కొండ మండల కేంద్రంతో పాటు కిసాన్‌నగర్, ముప్కాల్ మండలంలోని నాగంపేట్ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. రామ నామస్మరణలతో భక్తులు అలపించగా అయోధ్య రాముని అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బజరంగ్‌దళ్ నాయకులు హిందూ పరిరక్షణ కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్ రూరల్: మండలంలోని మెండోరా గ్రామంలో శనివారం అయోధ్య శ్రీరాముని అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ నెల 22 న అయోధ్యలో రామ మందిరం ప్రారంభం ఉన్నందున ఇంటింటికి అక్షింతలు పంపిణీ చేయడం జరుగుతుందని ట్రస్ట్ సభ్యులు ఈశ్వర్, శేఖర్ తెలిపారు. మందిరం ప్రారంభం రోజున పంపిణీ చేసిన అక్షింతలు నెత్తిన జల్లుకుని ఇంట్లో ఐదు జ్యోతులను వెలిగించాలని తెలిపారు. శనివారం గ్రామాల్లోని అన్ని హనుమాన్ ఆలయాల్లో పూజలు చేశారు.

సిరికొండ: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం శ్రీరాముడి అక్షింతలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. కొండపూర్, న్యావనంది, మైలారం తదితర గ్రామాల్లో రామ భక్తులు ఇంటింటికి తిరుగుతూ అయ్యోధ్య శ్రీరాముడి అక్షింతలను పంపిణీ చేశారు. చీమన్‌పల్లి గ్రామంలో మహిళలు మంగళహారతులు పట్టుకుని అయ్యోధ్య శ్రీరాముని అక్షింతలను పల్లకీలో అలంకరించి ప్రభాత్ భేరీ నిర్వహించారు.

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని కాశీ విశ్వనాథ ఆలయం వద్ద శనివారం శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు అయోధ్య నుంచి వచ్చిన పూజిత అక్షింతలను భక్తులకు ఆలయం వద్ద పంపిణీ చేశారు. మిట్టపల్లిలో ట్రస్టు ద్వారా వచ్చిన అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం: ఎమ్మెల్యే

బోధన్ రూరల్, జనవరి 6: ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం బోధన్ మున్సిపాలిటీ కార్యాలయంలో, ఇందూరు బీఈడీ కళాశాలలో చేపడుతున్న దరఖాస్తు ఫారాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు, 200 యూనిట్ల కరెంట్ మాఫీ తదితర అంశాలపై ప్రజలు అధికంగా దరఖాస్తులు చేసుకున్నారన్నారు. దరఖాస్తు ఫారాలను అన్‌లైన్ ప్రక్రియ ద్వారా అధికారులు పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి, కమిషనర్ ఖమర్ అహ్మద్, కౌన్సిలర్లు అబ్దుల్లా, జావీద్, డబ్బు, శరత్‌రెడ్డి, ఇందూరు విద్యా సంస్థల డైరెక్టర్ కొడాలి కిషోర్ కుమార్, ఆయా విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

బోధన్ రూరల్: రైతుల శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ రైల్వే స్టేషన్‌కు బోగీలో వచ్చిన ఎరువులను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో సొసైటీల ద్వారా రైతుల ఇంటి ముందుకే ఎరువులను అందజేస్తామని పేర్కొన్నారు. యాసంగి సాగు కోసం 640 టన్నుల ఎరువులను రైతుల కోసం తెప్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి, ఆర్డీవో రాజాగౌడ్, పీసీసీ డిలిగేట్ గంగాశంకర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్, బోధన్ వ్యవసాయ శాఖ అధికారి సంతోష్ తదితరులు ఉన్నారు.

అర్హులైన వారికి పథకాలు అందే విధంగా చూడాలి

నవీపేట: అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందే విధంగా చూడాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలనకు సంబంధించిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. నవీపేట మండలంలో 14,914 గృహాలు ఉండగా 15,698 దరఖాస్తులు అందాయని అన్నారు. జిల్లాలో యాసంగి పంట సాగుకు సంబంధించి 70వేల టన్నుల ఎరువులు అవసరం ఉండగా ఈ పాటికే 50వేల టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. సొసైటీలలో ఎరువులను అరువుగా ఇస్తే దానికి సంబంధిత సొసైటీ చైర్మన్లు, కార్యదర్శులే బాధ్యులవుతారని అన్నారు.



నవీపేటలో దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రెంజల్ : ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికీ అందించే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ప్రభుత్వ ప్రవేశపెట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై అందరికి అభివృద్ధి ఫలాలు అందే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఆయన వెంట ఆర్డీవో రాజాగౌడ్, ఎంపీపీ రజిని కిషోర్, తహసీల్దార్ రాంచందర్, ఎంపీడీవో శంకర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్, మాజీ జడ్పీటీసీ నాగభూషణంరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, మాజీ ఎంపీటీసీ కవిత, నాయకులు నితిన్, కిరణ్, సురేష్ పటేల్, సురేందర్ గౌడ్, తదితరులున్నారు.

మాక్లూర్ హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం

- ఘటనలో పాల్గొన్నవారితో సీన్ రీకన్‌స్ట్రక్షన్
- హత్యకు ఉపయోగించిన పరికరాలపై ఆరా

ఖిల్లా, జనవరి 6: మాక్లూర్‌కు చెందిన ఒకే కుటుంబానికి ఆరుగురు వ్యక్తులను హత్య చేసిన కేసును పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. హత్య చేసిన వారిని ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. హత్య కేసులో పూర్తిస్థాయి విచారణను చేపట్టారు. మాక్లూర్‌కు చెందిన ప్రసాద్ కుటుంబ సభ్యులను హత్య చేసిన వ్యక్తితో పాటు అతనికి సహకరించిన వారిని సైతం పోలీసులు తమ కస్టడీకి తీసుకున్నారు. వారిని విచారించి హత్యలకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారు. హత్య జరిగిన ప్రదేశాలు, జరిగిన విధానం, కొనుగోలు చేసిన వస్తువులు, తదితర వివరాలు పోలీసు బృందం సేకరిస్తుంది. అందులో భాగంగా శనివారం హత్యలో పాల్గొన్న వారిని నగరానికి తీసుకువచ్చారు. వారు సంచరించిన ప్రదేశాలు, హత్యకు ఉపయోగించిన వస్తువులు, పరికరాలు కొనుగోలు చేసిన స్థలాలను పోలీసులు దగ్గరుండి సమాచారం సేకరించారు. సంబంధిత వ్యక్తులను వస్తువుల వివరాలను తెలుసుకున్నారు. హత్యలో పాల్గొన్న కొందరు నగరంలోని నెహ్రూపార్క్ వద్దకు తరచుగా వచ్చేవారని దినసరి కూలీలు పోలీసులకు తెలిపారు. శనివారం నగరంలోని నెహ్రూపార్క్ లేబర్ అడ్డా సమీపంలోగల హార్డ్‌వేర్ షాపులో వారు పలు పరికరాలు (గడ్డపార, సుత్తి, తదితర)లను కొనుగోలు చేసినట్లు పోలీసులకు తెలపడంతో పోలీసులు ఆ దుకాణం వద్దకు తీసుకెళ్లి వస్తువులు అమ్మినట్లు నిర్ధారించుకున్నారు.

తొర్లికొండలో ఘనంగా వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, జనవరి 6: మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచే భక్తులు కొండపైకి చేరుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకిని భక్తులు కొండపై చుట్టు ప్రదక్షిణ చేశారు. ఆలయంలో భక్తులు, గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. నూతనంగా నిర్మించినున్న వెంకటేశ్వరస్వామి నిర్మాణానికి భక్తులు, గ్రామస్థులు విరాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని కలిసి ఐఎన్‌టీయూసీ నాయకులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 6: బోధన్ ఎమ్మెల్యే మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డిని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్ 327 ఐఎన్‌టీయూ జిల్లా కార్యదర్శి పుదారి గంగాధర్ కలిశారు. విద్యుత్ శాఖ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. సమస్యలను పరిష్కరించేలా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : రూరల్ ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

దర్పల్లి, జనవరి 6: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశ్యంతో ప్రజల వద్దకే పాలన కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల కేంద్రంలోగల ఆసుపత్రి స్థలాన్ని పరిశీలించిన ఆయన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో జరిగిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని తూచా తప్పకుండా అమలు చేస్తామని ఆయన చెప్పారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు చేరువయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను తీసుకోవాలని తీసుకున్న దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజాసంక్షేమం సాధ్యమని ప్రజల సౌకర్యార్థం ప్రజల వద్దకే పాలన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బాల్‌రాజ్, డీఎల్‌పీవో నాగరాజు, ఎంపీడీవో లక్ష్మణ్, తహశీల్దార్ మాలతి, ఎంపీవో రాజేశ్, ఈవో సైఫొద్దీన్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నిజామాబాద్ రూరల్, జనవరి6: రూరల్ మండలం జలాల్‌పూర్‌లో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి పర్యటంచనున్నారు. ఆదివారం ఉదయం జలాల్‌పూర్ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. గ్రామంలో నెలకొల్పిన జ్యోతిరావు ఫులే, కాన్షిరాం విగ్రహాలను ఆవిష్కరిస్తారు. దళితసంఘాల నాయకు లు గ్రామ కూడలిలో 11 ఏళ్ల క్రితం ఈ విగ్రహాలు ఏర్పాటుచేశారు. పలు వివాదాల కారణంగా విగ్రహాల ఆవిష్కరణ నిలిచిపోయింది. ఎట్టకేలకు 11 ఏళ్ల తర్వాత విగ్రహాల ఆవిష్కరణకు మోక్షం లభించింది.

సారంగాపూర్ జైలును సందర్శించిన ఎమ్మెల్యే

- ములాఖత్‌లో వీడీసీ సభ్యులకు పరామర్శ

నిజామాబాద్ రూరల్, జనవరి 6: జిల్లా కేంద్రంలోని 13వ డివిజన్ పరిధిలోని సారంగాపూర్ జిల్లా జైలును రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సందర్శించారు. శనివారం జైలు ములాఖత్ సమయంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే జైలుకు వచ్చారు. జక్రాన్‌పల్లి మండలానికి చెందిన వీడీసీ సభ్యులు, కాంగ్రెస్ నేతలు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. వారిని ఎమ్మెల్యే భూపతిరెడ్డి ములాఖత్‌లో కలుసుకుని ధైర్యం చెప్పారు. జరిగిన ఘటనను వారిని అడిగి తెలుసుకున్నారు. జైలుకు వచ్చిన ఎమ్మెల్యే భూపతిరెడ్డికి జైలు సూపరింటెండెంట్ ప్రమోద్ జైల్‌లో జరుగుతన్న కార్యక్రమాలను వివరించారు. ఎమ్మెల్యే వెంట సారంగాపూర్ కాంగ్రెస్ నాయకులు కుంచెపు నగేష్, రాంసింగ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

నిజామాబాద్ రూరల్: రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి శనివారం రూరల్ పరిధిలోని సారంగాపూర్‌లో పర్యటించారు. 13వ డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ నేతలతో సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు. గ్రామంలో జరుగుతున్న ప్రజా పాలనను పరిశీలించారు. దరఖాస్తులకు సంబంధించిన సమాచారం మున్సిపల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే భూపతిరెడ్డిని సన్మానించారు.

చికెన్ ధరలు





రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.200	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.205	రూ. 245

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.63,900	రూ.58,900	రూ.760

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : సలార్ (11.00, 2.35, 6.10, 9.45)

స్క్రీన్-2 : సలార్ (హిందీ) (11.05, 6.40, 10.15)

: ఆనిమల్ (హిందీ) 2.40)

స్క్రీన్-3 : దంకీ (హిందీ) (12.40, 7.15)

: హాయ్ నాన్న (4.00, 10.35)

స్క్రీన్-4 : డెవిల్ (12.50, 10.10)

: ఓలె ఆలె (మరాఠి) (4.00, 7.05)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-2 : డెవిల్ (10.45, 4.35)

: హాయ్ నాన్న (1.35)

: సలార్ (7.30, 10.40)

స్క్రీన్-3: సలార్ (1.25, 4.35)

: డెవిల్ (7.45, 10.40)



దేవి : డెవిల్ (11.15, 6.15, 2.15, 9.15)

లలితమహల్ : హాయ్ నాన్న (11.00, 2.15, 6.00, 9.45)

నటరాజ్ : సలార్ (హిందీ) (11.00, 2.15, 6.00, 9.45)

విజయ్ : సలార్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్